# సారీ తప్పలేదు

నరేష్ తన భుజానికి వేలాడే బ్యాగ్ లేదని గుర్తించేసరికి అతని గుండె గుభేల్‌మంది. అదిపోయి అప్పటికే చానా సేపయిందేమో! ఇప్పుడేం చేయ్యాలె! ఆ బ్యాగ్‌లో అతని పాస్‌పోర్టు వుంది. దాంతోపాటు కొన్ని డాలర్లున్నాయి. ఇరవైవేలు ఇండియన్ కరెన్సీ వుంది. డబ్బు పోతేపోయింది. ఆ బ్యాగ్ దొరికినవాళ్ళు డబ్బు తీసుకొని తన పాస్‌పోర్టు ఇస్తే బాగుండును. మేనమామ కొడుకు సుధాకర్ పెండ్లికి నరేశ్ ఇండియా – హైదరాబాదు వచ్చాడు.

"నాకు లీవ్ లేదురా!" అని మొత్తుకున్నా వాడు వినలేదు. పోయినేడాది తన పెండ్లిలో నరేశ్ పనులన్నీ వాడే నెత్తిమీద వేసుకొని చేసాడు. ఇప్పుడు వాడి పెండ్లికి రాకపోతే అమెరికా వాళ్ళంతా ఇంతేరా! – వాళ్ళకు యే అనుబంధాలుండవని అలుగుతాడు. అందుకే వాడి మనసు నొప్పించటం ఇష్టంలేక ఏదో విధంగా వారం రోజులు – శని ఆదివారాలు కలిపి బాస్‌ను ఒప్పించి వచ్చాడు. నరేశ్ మళ్ళా సోమవారం ఆఫీసులో వుండాలి. ఆరోజే జపాన్ నుంచి వచ్చే కార్ల మాన్యుఫాక్చరింగ్ కంపెనీ వాళ్ళతో ఆఫీసులో చాలా ముఖ్యమైన మీటింగు వుంది. కార్ల డిజైనింగ్ సెక్షన్లో వున్న నరేశ్ ఆ మీటింగులో తప్పక వుండి తీరాలె. అమెరికాలోకన్నా జపాన్, జర్మనీ దేశాల్లో క్రమశిక్షణతో కష్టపడి అంకితమై పని చేస్తారు. అందుకే ఆ మీటింగు రోజు నరేశ్ లేకపోతే బాగుండదు. అక్కడ తప్పక వుండాలె!

సుధాకర్ పెండ్లి సోమవారం జరిగింది. మంగళవారం రాత్రి రిసెప్షన్ అయింది. పాత స్నేహితులంతా కలిసారు. అందరి నోటినుంచి ఒక్కటే మాట! – తమనెట్లా అయినా అమెరికా పిలిపించుకోరా అని. "అరే! నాకు అమెరికన్ వీసా వచ్చేసిందనుకున్నారా! పెట్టాల్సిన కాగితాలన్నీ పెట్టాను. స్టాంప్ వేయబోయినవాడు ఆపేసి కాగితాలు "సారీ!" అంటూ నా చేతికిచ్చాడు. అస్సలు ఆ వీసా రహస్యమేంటిరా! ఎంతమంది ఎన్ని విధాల స్టడీ చేసినా వాళ్ళ పద్ధతేమిటో అంతుపట్టటం లేదు!"– ఆ విధంగా అందరూ అమెరికన్ వీసా గురించే మాటలు! చర్చలు! – ఆ రిసెప్షన్ పార్టీలో అందరూ నరేశ్ చుట్టూ

చేరారు. అమెరికన్ వీసా ఏదో అతని చేతిలో వున్నట్లుగా మాట్లాడటం నరేశ్‌కు ఊపిరాడకుండా చేసింది.

సుధాకర్ నరేశ్‌కు మేనమామ కొడుకు కన్నా క్లాసుమేటు. అంతకుమించి మంచి దోస్త్. ఫోనులో వాడి నిష్ఠూరాలు వినలేక నరేశ్ ఈ పెండ్లికి వచ్చాడు. రిసెప్షన్ తెల్లవారి ఆటోలో తన అత్తవారింటికి పోయి రాజా పంపిన మేకప్ సామాన్లన్నీ వున్న ప్లాస్టిక్ సంచీని మరదలికిచ్చిన తరువాత నరేశ్ షాపింగ్ కెళ్ళాడు. రిసెప్షన్ రోజు పొద్దునంతా షాపింగ్ చేసాడు. రిసెప్షన్ తెల్లవారి షాపింగు చేసిం తర్వాత చూసుకుంటే ఫోల్డరు బ్యాగు లేదు! నిన్న షాపింగు తర్వాతనే పోయిందా! - తెలియదు. ఈ రెండు రోజుల్లో తన బ్యాగ్ ఎప్పుడు పోయిందో అతడు గుర్తించనేలేదు. శనివారం రాత్రి నరేశ్ అమెరికా బయలు దేరాలి. ప్లేన్ రాత్రి ఒకటిన్నరకుంది! ఎట్లా? బుధ బేస్త, శుక్ర - మూడు రోజుల్లో తనకు డూప్లికేటు పాస్‌పోర్టు దొరకాలి! బుధవారం రాత్రి వరకు చూసాదు ఎవరైనా దొరికినవాళ్ళు పాస్‌పోర్టు తెస్తారేమోనని. ఎవరూ రాలేదు.

"తెల్లారేసరికి నీ పాస్‌పోర్టు దొరుకుతుందిలే. భయపడకు" అంటాడు సుధాకర్. అతని నమ్మకం చూస్తే నరేశ్‌కు చిరాగ్గా వుంది. బేస్తవారం పొద్దున తొమ్మిది దాటింది. అయినా పాస్‌పోర్టు తీసుకొని ఎవరూ రాలేదు. నరేశ్ గుండె దడదడ కొట్టుకుంటున్నది. అందరూ పెండ్లిపనుల అలసటతో వున్నారు.

సుధాకర్ పడకగదినుంచి అప్పుడు ఆవలించుకుంటూ వచ్చాడు.

"నరేశ్! ఏమైంది! నీ పాస్‌పోర్టు రాలేదా?" అని చిరునవ్వు నవ్వాడు. వాడి తీరు చూసి నరేశ్‌కు చుర్రుమంది.

"ఒరే! నేను పాస్‌పోర్టు ఆఫీసుకు పోతున్నానురా-" అని చెప్పి నరేశ్ అక్కడ్నుంచి సర్రున కదిలాడు.

వెంటనే నిన్న పోలీసుస్టేషన్లో రిపోర్టు వ్రాయించినా ఇంతవరకు ఏం లాభం లేదు! నిరాశగా నరేశ్ పాస్‌పోర్టు ఆఫీసుకు బయలుదేరాడు.

నరేశ్ మంగళవారం రోజంతా షాపింగ్ చేసాడు. బుధవారం మధ్యాహ్నం వరకు షాపింగులోనే మునిగిపోయి వున్నాడు. వచ్చేటప్పుడు రోజా ఇండియానుంచి కొనుక్కురావల్సిన వస్తువుల లిస్టును వ్రాసి ఓ చాంతాడంత కాగితాన్ని చేతిలో పెట్టింది. అయినా అమెరికాలో దొరకని వస్తువులు ఇక్కడే దొరికే వస్తువులేముంటాయి!- ఎక్కడికి పోయినా షాపింగు అనేది లేకుండా ఆడవాళ్ళు బయటపడనియ్యరు!- విసుక్కున్నాడు నరేశ్. రోజా చెప్పిన వస్తువులన్నీ కొనటానికి నరేశ్ రెండ్రోజులు ఎన్నో షాపులు ఎక్కాడు దిగాడు. మరి ఆ ఫోల్డర్ బ్యాగ్‌ను ఎక్కడ మరచిపోయాడో తెలియదు. ఒకవేళ ఆటోలో మరచిపోయాడేమో! క్రెడిట్ కార్డు జేబులో వుండబట్టి నరేశ్‌కు బ్యాగ్ తెరిచే పని పడలేదు. అయినా రోజా ఇండియా నుంచి కొనుక్కురమ్మని అంత పెద్ద లిస్టు ఇయ్యటమెందుకు? ఆ షాపింగు పరేషాన్‌లో బ్యాగును ఎక్కడో మరిచిపోయి వుంటాడు. ఇప్పుడు పాస్‌పోర్టు పోయిందని ఫోనుచేసి రోజాకు చెప్తే - "నేను మీ వెంట లేకపోతే మీ సంగతి అంతే! ఇటువంటిదేదో చేస్తారని నాకు తెలుసు!"- అని దెప్పిపొడుస్తుంది. అందుకే చెప్పలేదు కూడా. అయినా సరోజతో తన పెండ్లయి ఏడాదే కద అయింది. అంతకుముందు తన

సంగతి సరిగ్గానే వుంది కద! తన జీవితమంతా తనే సవరించినట్లుగ దెప్పిపొడుస్తుందెందుకు రోజా! - సరే ఆ విషయం తర్వాత ఆలోచిస్తాను ముందు పాస్‌పోర్టు డూప్లికేటు సంపాదించాలె - అనుకొని నరేశ్ జల్దీ జల్దీ ఆటో దిగి పాస్‌పోర్టు ఆఫీసు వైపు నడిచాడు.

పాస్‌పోర్టు ఆఫీసు ముందంతా జనం. గుంపులు గుంపులుగా కన్పించారు. ఇంత జనం ఎందుకున్నారు! ఇంతమంది పాస్‌పోర్టు కోసమే వచ్చారా? అంతుపట్టలేదు నరేశ్‌కు. పాస్‌పోర్టును జిరాక్స్ చేసి సూటుకేసులో పెట్టుకున్నాడు. ఏదైన ఇటువంటి ప్రమాదమే జరిగితే పనికివస్తుందని. "జిరాక్స్ కాపీ వుంది గదరా! ఇంతగనం పరేషానెందుకవుతున్నవ్!" సుధాకర్ గట్టిగా నవ్వింది గుర్తుకు వచ్చింది నరేశ్‌కు. నిజమే! ఈ జిరాక్స్ కాపీతో తనకు డూప్లికేట్ పాస్‌పోర్టు దొరకటం ఏం కష్టం కాకూడదు! ఆ జిరాక్స్ కాపీని చేతిలో గట్టిగా పట్టుకొని నరేశ్ ముందుకు నడిచాడు. జనాన్ని చీల్చుకొని కదిలాడు. పాస్‌పోర్టు ఆఫీసు ముందున్న రెండు గేట్లు లావుపాటి చువ్వలతో ఎత్తుగా బలంగా జైలు ద్వారాల్లాగా కన్పించాయి. నరేశ్ ఒక గేటు ముందు నిలబడ్డాడు. అక్కడంతా ఖాకీడ్రెస్సుల్లో చేతిలో లాఠీలతో పోలీసుల్లాంటి వాచ్‌మెన్‌లున్నారు. ఒకడు నరేశ్‌ను లోపలికి పోకుండా ఆపాడు. ఛాతిమీద లాఠీ ఆనించి "ఏయ్! ఎక్కడికి పోతున్నవ్?" గద్దించాడు.

ఇదేంది! ఇదేమైన జెయిలా! ఆశ్చర్యపోయాడు నరేశ్.

"పాస్‌పోర్టు..." అని విషయం చెప్పబోయాడు.

"అయితే అటు పో! లైన్‌లో నిలబడు!" అన్నాడు వాచ్‌మెన్ లాఠీతో నూకేస్తూ.

"అరే! లాఠీతో ఎందుకు తోసేస్తున్నాడు!..." నరేశ్‌కేం అర్థం కాలేదు. మళ్ళా ముందుకు చూసాడు. ఇదేంది! ఈ ఆఫీసు చీమలు చొరని చిట్టడవి కాకులు దూరని కారడవిలా వుంది! యమభటుల్లాగా ఈ వాచ్‌మెన్‌లు ఏంది! ఈ ప్రజాప్రభుత్వంలో ఎవరైనా పోయి పాస్‌పోర్టు తీసుకోవచ్చు గద! సమస్యలు నాలాంటివేవో వుంటే చెప్పి హాయిగా తీర్చుకోవచ్చు గద! మరి ఈ రాక్షసుల్లాంటి వాచ్‌మేన్‌లు ఈ కొండ చిలువల్లాంటి లైన్‌లు ఎందుకు? ఏం అంతుబట్టలేదు నరేశ్‌కు. పోయి "ఎన్‌క్వయరీ" - విచారణ - అని రెండు భాషల్లో వ్రాసిన బోర్డు తగిలించిన కిటికీకి ఎదురుగా వున్న లైన్‌లో చిట్టచివర ఎక్కడో నిల్చున్నాడు. మధ్యాహ్నమైంది అయినా లైన్ కదలటంలేదు. ఇంతలో ఒక్కరొక్కరు తమ షోల్డర్ బ్యాగుల్లోంచి టిఫిన్లు తీసి తినటం మొదలుపెట్టారు. బాటిల్లో నీళ్ల తెచ్చుకున్నారు. ఓహ్! వీళ్ళకిది ఓ పిక్నిక్‌లాగా వుంది! నరేవ్ ఆకలితో అటు యిటు చూసాడు. ఎవరో ఓ బాయ్ చాయ్‌తో కన్పిస్తే పిల్చి చాయ్ తాగాడు. ఇక చూసి చూసి విసిగిపోయి - "ఏమైంది! లైన్ కదలటం లేదు" అడిగాడు ముందున్నతన్ని.

"ఇంకా ఎన్‌క్వయరీ కిటికీ తెరుచుకోలేదు. ఎవరూ రాలేదండి' నిక్కి నిక్కి ముందుకు చూస్తూ అన్నాడతడు.

"పన్నెండు దాటింది గద!..." గొణిగాడు నరేశ్.

"ఎన్‌క్వయరీ మధ్యాహ్నం రెండు గంటలవరకే! ఇంకా ఎవరూ రాలేదు. వస్తారో లేదో?" అన్నాడతను. నిరాశ విచారం ధ్వనించింది. మధ్య మధ్య ఖాకీడ్రెస్సులవాళ్ళు వచ్చి లైన్‌లో వుండండి అంటూ లాఠీలు ఝుళిపిస్తూనే వున్నారు.

నరేష్‌కు మొదటిసారి తను పాసుపోర్టు తీసుకున్నప్పుడు ఇంత హంగామా జరిగినట్లుగా గుర్తులేదు. అప్పుడేమైంది? - ఓహ్! అప్పుడు అంతా నాన్నగారు చూసుకున్నారు. తనకేం తెలియలేదు! ఇంతలో పెద్ద కలకలం!

"ఈరోజు ఎన్‌క్వయరీలో ఎవరూ రారంట!" ఎవరో ముందున్న వాళ్ళు అరిచారు. నరేష్ ఉలిక్కిపడ్డాడు.

"అయ్యో! ఎట్లా! నా పాస్‌పోర్టు!"

"ఛలో ఛలో!-" అంటూ ఖాకీ డ్రస్సులవాళ్ళు తరిమేయటం మొదలుపెట్టారు. వెళ్ళిపోయేవాళ్ళ వీపులమీద లాఠీలతో తడ్తూ అందర్నీ బయటికి తోలేసి ధనాధనమని గేట్లను గొలుసులతో బిగించేసారు.

"అరే! ఎట్లా! రేపొక్కరోజు వుంది. శనివారం పాస్‌పోర్టు ఆఫీసుకు సెలవు!" బరువుగా కదిలాడు నరేశ్.

ఎవరో తన వెనుక సాబ్! - అని పిలిచినట్లనిపించి నరేశ్ వెనుకకు తిరిగాడు. నెత్తిమీద అల్లిన టోపీ తగిలించుకొని ఒకతను కన్పించాడు.

"పాస్‌పోర్టా? - పైసలు ఇస్తే నేను తెచ్చిపెడ్తాను" అన్నాడు.

అతని వాలకం చూసి నరేశ్ మాట్లాడకుండా దబదబ ముందుకు నడిచి ఆటోలో ఎక్కేసాడు.

ఆ రాత్రంతా నరేశ్‌కు నిద్రపట్టలేదు. మర్నాడు పొద్దున్నే ఎనిమిది గంటలకే పోయి లైన్‌లో నిలబడాలి. తొందరగా పోతే కాస్సేపట్లో పనయిపోతుంది! ఎన్‌క్వయిరీ క్లర్క్ వస్తాడో రాడో? ఎందుకు రాడు! వస్తాడు! పనయిపోతుంది!- రేపొక్కరోజే వుంది! ఒకవేళ ఆ టోపీ అతనికి పైసలిస్తే పనయిపోతుందేమో!- ఏమో అతని వాలకం పాస్‌పోర్టు తెచ్చిపెట్టేవాడిలాగా లేదు. పైసలు తీసుకొని మాయమవుతాడు... రాత్రంతా నరేశ్‌కు ఇవే ఆలోచనలు. పాస్‌పోర్టు ప్రాసెస్ చాల సులభమైంది అన్నారెవరో. అయితే ఖాకీడ్రెస్సుల్లో లాఠీలతో ఆ భయంకరమైన వాచ్‌మెన్‌లు ఎందుకక్కడ!- అక్కడికి వచ్చిన జనాన్ని టెర్రరిస్టులను చూసినంత కర్కశంగా... లాఠీలతో తోలటమెందుకు! జనాన్ని అండర్‌వరల్డ్ వాళ్ళను హంతకులను రౌడీలను చూసి బెదిరించినట్లుగా బెదిరించటమెందుకు!... అండర్ వరల్డ్ వాళ్ళకు మరి రెండు మూడు దొంగ పాస్‌పోర్టులున్నాయని చదివాడు తను. వాళ్ళు వాటినెట్లా సంపాదించారు?... వాళ్ళకేవో పరిచయాలు ఇన్‌ఫ్లుయెన్స్‌లు పైసలు తినిపించడాలు వుంటాయేమో! - ఏమో తెలియదు. ఇంకా ఈ మధ్య విన్నాను - ప్రజాతంత్ర పాలకులు తమ కుటుంబ సభ్యుల పాస్‌పోర్టులతో లక్షల్లో డబ్బు తీసుకొని జనాన్ని అమెరికాకు పంపిస్తున్నారని! మరి యమభటుల్లాంటి ఖాకీడ్రెస్సులవాళ్ళు లాఠీలతో ఏం చేస్తున్నారు! సామాన్యులమీద ఝుళిపిస్తున్నారా?... అయినా అమెరికా అంటె అంత పిచ్చి ఎందుకు? ఒక్క డాలర్‌కు నలభైమూడు రూపాయలనా? - ఈ పిచ్చి! లేకపోతే మరెందుకు? అయినా మనవాళ్ళు భారతదేశం విడిచిపెట్టి ఏ దేశానికైనా పోవటానికి తయ్యార్! ఆఖరికి సైబీరియా పొమ్మన్నా పోతారు!- నవ్వుకున్నాడు నరేశ్. ఇక్కడి వ్యవస్థ వాళ్ళనట్లా నెట్టేస్తున్నదా!... నాకెవరైనా పైనున్నవాళ్ళు పరిచయముంటే ఈ పాస్‌పోర్టును

సంపాదించటం ఇంత కష్టమయ్యేది కాదేమో!... పాస్‌పోర్టు జిరాక్స్ వుంది కద! ఈ కంప్యూటర్ల కాలంలో డూప్లికేటు పాస్‌పోర్టు క్షణంలో ఇష్యూ అవుతుంది. ఏం కష్టం కాదులే! – "ఏం కష్టం కాదులే"– అన్న సుధాకర్ అత్తగారింట్లో తిష్ఠవేసాడు. లేకపోతే వాడేమైన ఉపాయం చెప్పేవాడేమో!

పొద్దున్నే ఎనిమిదింటికే నరేశ్ పాస్‌పోర్టు ఆఫీసు చేరుకున్నాడు. చేరుకోగానే మొదటి కర్తవ్యంగా జేబులోంచి పది రూపాయల నోటు తీసి లాఠీతో నిల్చొని వున్న వాచ్‌మెన్ చేతికందించబోయాడు. వాడు పది రూపాయలవైపు చూసి తన జర్దాపాన్‌తో నిండిన మూతిని పక్కకు తిప్పి– "ఉఁ ఉఁ నేను తీసుకోను!" అన్నాడు.

అబ్బ! ఎంత మంచివాడు. ఎవరిలోనైనా నీతిమంతులుంటారు. ఎందుకుండరు! లేకపోతే షైనింగ్ ఇండియా ఇంతగా షైన్ అయ్యేదా! నిన్నటిలాగా వీపుమీద లాఠీనెక్కడ పెట్టి నెట్టుతాడో అనే భయంతో వాచ్‌మెన్‌కు షేక్‌హ్యాండ్ ఇస్తున్నట్లుగా చేతిని చాపి పది రూపాయల నోటు వాడి చేతిలో పెట్టబోయాడు. కాని పాపం వాడు అటువంటి రకంకాదు! – నరేశ్ ముందుకు కదలబోయాడు.

"సార్! నేను పది రూపాయలు తీసుకోను–" అని అర్థవంతంగా పండ్లు ఇకిలించాడు. హో!– అయితే అతని రేటు పది కాదన్నమాట! బిచ్చగాళ్ళు కూడా ఈ రోజుల్లో అర్థరూపాయి తీసుకోవటం లేదు!– నరేశ్ జేబులోంచి యాభై రూపాయల నోటు తీసి అతని చేతిలో పెట్టాడు.

"రండి సార్! ఇక్కడ నిలబడండి మీరు. ఇప్పుడే ఎన్‌క్వయరీ క్లర్క్ వస్తాడు. ఈరోజు మీ పని అయిపోతుంది" మర్యాదగా అన్నాడు. లైన్‌లో నరేశ్‌కన్నా ముందే వచ్చి నిల్చున్న నలుగుర్ని తప్పించి ముందు నిలబెట్టాడు. లైన్‌లో వెనకకు జరిగినవాళ్ళు నరేశ్‌వైపు గుర్రుమని చూసారు.

"మేం పొద్దున్నే నాలుగ్గంటలకు వచ్చి నిల్చున్నాం" గొణిగాడు ఒకతను. అయినా నరేశ్ లెక్క చేయలేదు. తన వాచీ చూసుకున్నాడు – ఎనిమిదన్నరయింది! సరిగ్గా పదిన్నరకు ఎన్‌క్వయిరీ కిటికీ టక్కటక్కమనే చప్పుడులతో తెరుచుకుంది.

"మీ ప్రాబ్లం ఏమిటీ?–" ఎన్‌క్వయిరీ క్లర్కు గొంతు కర్కశంగా ధ్వనించింది. అసహనంగా ఉంది ఆ గొంతు.

నరేశ్ విషయం చెప్పి జిరాక్స్ కాపీని అతనికందించాడు.

దాన్నతడు తాకలేదు. "పోలీసు రిపోర్టు ఇచ్చారా?" ఇంకా కర్కశంగా వుంది కంఠం.

"ఇచ్చాను".

"మరి దాని కాపీ ఏది?" మళ్ళీ కర్కశం.

"కాపీ నాకియ్యలేదు పోలీసులు" దీనంగా నరేశ్.

"కాపీ తీసుకరండి" నడవండి అన్నట్లుగా వుంది గొంతు.

"నెక్ట్స్" అరిచిందా గొంతు కర్కశంగా.

నరేశ్ మెల్లిగా బయటికి కదిలాడు. నరేశ్ అంత దిగులుగా మెల్లగా ఎప్పుడూ నడువలేదు. ఎప్పుడూ ఉరుకులు పరుగులే. ఇక అమెరికాలో ఇటువంటి సందర్భమే

రాలేదు! పోలీసుస్టేషన్ చేరుకుంటే అక్కడ డ్యూటీలో తుపాకీతో నిలబడ్డ పోలీసు జవాన్ తప్ప ఎవరూ లేరు. అంతా ఖాళీగా వుంది.

"ఎక్కడికి పోయారందరు?" ఆ జవాన్‌నే అడిగాడు నరేశ్.

"ఈరోజు చీఫ్ మినిస్టరు ఈ ఏరియాలో వున్న స్లమ్స్‌ను విజిట్ చేస్తున్నారు సార్! అందరు డ్యూటీ మీద అక్కడికే పోయిన్రు" అన్నాడు ఆ జవాన్.

నరేశ్ తల తిరిగిపోయింది. "ఈరోజు తన పాస్‌పోర్టు వచ్చేమార్గం కన్పించటం లేదు. ఎట్ల తను సోమవారం ఆఫీసులో వుండాలే. ఎట్ల!" నిరాశ నిస్పృహలతో అతనికేం చేయాలో తోచలేదు. ఆటో తీసుకొని మళ్ళా పాస్‌పోర్టు ఆఫీసు చేరుకున్నాడు. ఎదురుగా పాస్‌పోర్టు ఆఫీసు. జనం లేరు. గేట్లు మూసేశారు. వాచ్‌మెన్‌లు ఒకరిద్దరు ముచ్చెట్లు పెడ్తూ గేట్లదగ్గర కన్పించారు. లోపలికి ప్రవేశించేది ఎట్లా?- దిగులుగా నరేశ్ నిలబడ్డాడు. అట్లా ఎంత సేపైందో తెలియదు. పక్కనుంచి "సాబ్! సాబ్!" అన్న పిలుపు వినిపించి నరేశ్ ఈ లోకంలోకి వచ్చాడు. ఎవరో బిచ్చగాడేమో. విసుగ్గా అతనివైపు చూసాడు - అతడు! అల్లిక టోపీని నెత్తిమీద బోర్లించుకున్నతను! నరేశ్ ముఖంలోకి చూసి అతడు కన్పించీ కన్పించని నవ్వు నవ్వాడు.

"అవునూ! - నా పాస్‌పోర్టు పోయింది. ఇదిగో దాని జిరాక్స్ కాపీ. నువ్వు నాకు డూప్లికేటు పాస్‌పోర్టు ఇప్పిస్తావా? ఎంత డబ్బుంటే అంత ఇస్తాను. రేపు రాత్రి నేను వెళ్ళిపోవాలి!" ఆతురతగా అంతా చెప్పేసాడు నరేశ్.

"కొంత డబ్బు ఖర్చవుతుంది. రేపు పొద్దటికల్లా మీ పాస్‌పోర్టు మీ చేతిలో వుంటుంది" అన్నాడతను.

"ఓకే! నువ్వు చెప్పేది నిజమేనా! ఈ కష్టంనుంచి గట్టెక్కిస్తే నీకెంత డబ్బయినా ఇస్తాను" నరేశ్ కండ్లల్లో కన్నీటిపొర కన్పించింది. మొఖంలో దైన్యం చోటు చేసుకుంది.

"సరే! మీ పాస్‌పోర్టు జిరాక్స్ కాపీ ఇచ్చి మీరు వెళ్ళిపోండి".

నరేశ్ అతని కండ్లల్లోకి చూసాడు. "అతన్ని నమ్మొచ్చునా?"- అనుకున్నాడు. అయినా ఇప్పుడు గత్యంతరం లేదు. జిరాక్స్ కాపీని అతని చేతిలో పెట్టి ఇంటివైపు బయలుదేరాడు. అతని మనస్సంతా గందరగోళంగా వుంది. ఎన్నో ప్రశ్నలు అలల్లా లేస్తున్నాయి - "ఇదేంది! తను ఈ దొడ్డిదారి తొక్కటమా? అవినీతి అన్యాయానికి లొంగటమా? డబ్బు ఇచ్చి పని చేయించుకోవటమా? లంచం ఇయ్యటమా?... కాని ఏం చేస్తాను? తను ఈ మార్గం తొక్కక తప్పలేదు! స్వేచ్ఛగా ఆఫీసు లోపలికి పోయే పరిస్థితే లేదు. అన్ని మార్గాలు మూసుకపోయిం తర్వాతే ఈ మార్గం తొక్కవలసి వచ్చింది. పైసతో పని అవుతుంది! పైసతో ఏ పనయినా ఇండియాలో అవుతుంది!- అన్న మాటలను ఇన్నాళ్ళు తను నమ్మలేదు. మనం సాఫ్‌సీదాగా వున్న తర్వాత పైసలియ్యటం ఎందుకని వాదించేవాడు! ఇప్పుడు తెలిసింది తనకు! వ్యవస్థే అట్లా వుంది. ఈ వ్యవస్థను ఇట్లా దిగజార్చిన వైరస్ ఎవరు? ఈ రాచపుండును కోతిపుండును తయారు చేసింది ఎవరు?" పెద్దగా నిట్టూర్చాడు నరేశ్.

తెల్లవారి పొద్దు పొడిచిందో లేదు నరేశ్ నిద్రలేచాడు. స్నానమదీ తొందరగా కానిచ్చి ముందు వరండాలో చేతిలో పేపరుతో కూర్చున్నాడు. అతని దృష్టి పేపరు

మీదున్నా మనసు ఆందోళనతో వుంది – అతడు వస్తాడా? లేడా? తన పాస్‌పోర్టు వస్తుందా? లేదా? లేకపోతే ఏం చేయాలి!– ఇవే ప్రశ్నలు నరేశ్‌ను వేదిస్తున్నాయి. కదలకుండా అక్కడే కూర్చున్నాడు. ఏ చప్పుడైనా చూపులు గేటువైపు తిరుగుతున్నాయి. తొమ్మిది గంటలకు అతడు మెల్లిగా గేటు తీసుకొని లోపలకి వచ్చాడు.

"ఏమైంది నా పాస్‌పోర్టు?–" ఆందోళనగా అడిగాడు నరేశ్.

"పనయింది సాబ్!– ఇగో మీ పాస్‌పోర్టు".

నరేష్ పాస్‌పోర్టును తీసుకొని మొదటినుంచి చివరివరకు తిప్పిచూసాడు. తన పాస్‌పోర్టే! సందేహం లేదు.

ఆ పని అతనికెట్లా సాధ్యమైంది! తను అడగకూడని ప్రశ్న.

అంతే!– ఆ క్షణంలో అతడు నరేశ్‌కు ఒక దేవుడిలాగా కన్పించాడు. అతడడిగినంత డబ్బు అతని చేతిలో సంతోషంగా పెట్టాడు. ఇది సరయిన మార్గం కాదే!– అని మనస్సులో ఎక్కడో ప్రశ్న ఉదయించింది. అవినీతి అక్రమాన్ని పోషిస్తున్నావా? అట్లా ప్రశ్నించే మనస్సు కవాటాన్ని నరేశ్ గట్టిగా మూసేసాడు. ఇది తప్పదు! సారీ! తప్పలేదు!– నిట్టూర్చాడు నరేశ్. ఆ రోజే అమెరికన్ వీసా రెన్యూ అయింది. రాత్రి అమెరికా ప్లేను ఎక్కాడు నరేశ్.

*"వార్త", ఆదివారం, 25 నవంబరు, 2007*